క్లుప్తంగా

శివరాత్రి ఉత్సవాలకు విరాళాలు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న లింగమూర్తి

హుస్నాబాద్‌రూరల్: మహాశివరాత్రి ఉత్సవాలకు పందిల్ల గ్రామస్తులు రూ.1,0016 విరాళాలు అందించినట్లు మాజీ సర్పంచ్ రమేశ్ తెలిపారు. గ్రామంలో కొత్తగా నిర్మించిన దేవాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా జరిపేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆలయంలో మంగళవారం హోమం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి ఉత్సవాల ఏర్పాట్లను జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, సీఐ శ్రీనివాస్, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి పర్యవేక్షించారు. బుధవారం తెల్లవారుజాము నుంచే పూజలు ప్రారంభమవుతాయని ఈఓ కిషన్‌రావు తెలిపారు.

ఆర్యవైశ్యులు సంఘటితం కావాలి


మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

కొమురవెల్లి(సిద్దిపేట): రాష్ట్రంలోని ఆర్యవైశ్యులు సంఘటితం కావాలని ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షుడు అమరావతి లక్ష్మీనారాయణ పిలుపు నిచ్చారు. స్థానిక వైశ్య సత్రంలో మంగళవారం ఇతర నాయకులతో కలసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యుల ఐక్యతకు, అభివృద్ధికి రాజకీయంగా ఎంతో కృషి చేశానన్నారు. ఉప్పల్ భగాయత్‌లో ప్రభుత్వం స్థలం కేటాయించేందుకు, సభ్యత్వం పెంచేందుకు పాటుపడ్డానని గుర్తుచేశారు. మార్చి 4న జరిగే ఎన్నికలలో తనను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కొమురవెల్లి మల్లికార్జున స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమావేశంలో గణేశ్‌గుప్త, రామకృష్ణ, వెంకటేశ్, రవికుమార్, శ్రీనివాస్, రత్నాకర్, ఆంజనేయులు, నాగరాణి, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శన


పోస్టర్లను తిలకిస్తున్న అధ్యాపకులు

హుస్నాబాద్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో 'విలియం షేక్‌స్పియర్ రచనలు–ఆంగ్లభాష గొప్పతనం' అనే అంశంపై విద్యార్థులు మంగళవారం పోస్టర్ల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ భిక్షపతి మాట్లాడుతూ ఆంగ్లభాష అంతర్జాతీయ భాష అని, దానిని విద్యార్థులు తప్పకుండా నేర్చుకోవాలన్నారు. ఆంగ్లభాషపై విద్యార్థులకు ఉన్న అపోహలు, భయాన్ని తొలగించడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో సమన్వయకర్త డాక్టర్ సబి ఫాతిమా, అధ్యాపకులు కుమారస్వామి, అనిల్ కుమార్, చంద్రమౌళి, విజయ, అనిత తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారం అవసరం


మాట్లాడుతున్న బాలలక్ష్మి

చేర్యాల(సిద్దిపేట): శతశాతం కుటుంబ సర్వే జరిగేలా అందరూ సహకరించాలని బీసీ కమిషన్ మెంబర్ బాలలక్ష్మి కోరారు. మంగళవారం పట్టణ కేంద్రానికి వచ్చిన ఆమె మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుటుంబ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని, గత సర్వేలో నమోదు కాని వారి వివరాలు తిరిగి నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్యూమరేటర్లు, ఆర్పీలు, సూపర్‌వైజర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు దంత పరీక్షలు


చిన్నారికి దంత పరీక్ష చేస్తున్న వైద్యురాలు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చంద్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో తెలంగాణ సూపర్ స్పెషాల్టీ దంత వైద్యశాల ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు దంత వైద్యపరీక్షలు నిర్వహించారు. 120 మందికి పరీక్షలు నిర్వహించి 18 మందికి దంత సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యురాలు రమాదేవి మాట్లాడుతూ విద్యార్థులు తప్పకుండా దంతాలను ప్రతిరోజు శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మారెడ్డి, ఉపాధ్యాయులు దేవదాసు, బాలస్వామి, సత్తయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్వయంభు.. శంభులింగేశ్వరుడు

- శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన వర్గల్
- నేడు విశేష అభిషేకాలు, అర్చనలు

వర్గల్(గజ్వేల్): సహజసిద్ధ శంభుని కొండ గుహలో స్వయంభుగా వర్గల్‌లో వెలసిన శంభులింగేశ్వరుడి ఆలయం బుధవారం మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబైంది. ఈ క్షేత్రం శ్రీశైలం అంతటి మహిమాన్విత క్షేత్రంగా పేరొంది, భక్త జనాదరణతో విరాజిల్లుతోంది. కాశీ విశ్వేశ్వర క్షేత్రం మాదిరిగా ఆలయంలో లింగాకృతిలో వెలిసిన మహాదేవుడు, ఆ పక్కనే పాలగుండం ఉంది. ఆలయం వెనుక వైపు కాలభైరవస్వామి, ఎదురుగా శ్మశానవాటికతో కాశీ క్షేత్ర లక్షణాలు స్పష్టంగా గోచరిస్తాయి. శివానుగ్రహం కోసం ఇక్కడ మునులు తపమాచరించినట్లు ప్రతీతి. శంభుదేవుని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని అభిషేకజలం సేవిస్తే వ్యాధులు నయమవుతాయని భక్తుల నమ్మకం.

తెల్లవారుజాము నుంచే కార్యక్రమాలు

బుధవారం తెల్లవారుజామున 4.30ని.లకు గణపతిపూజ, ఏకాదశ రుద్రం, ఉదయం 8 గంటలకు అఖండ శివ నామస్మరణ ప్రారంభం. అలాగే రాత్రి 10 గంటలకు శివపార్వతుల శోభాయాత్ర, అర్ధరాత్రి లింగోద్భవ సమయంలో శంభులింగేశ్వరునికి మహా రుద్రాభిషేకం, బిల్వార్చనలు, భజన కార్యక్రమాలు జరుగుతాయి. ఉత్సవాలలో భక్తులు పాల్గొని తరించాలని అర్చకుడు వీరభద్రయ్య కోరారు.


ఉత్సవాలకు సిద్ధమైన ఆలయం

వరిలో అగ్గి తెగులు గుబులు

- నత్రజని వాడొద్దు
- మండల ఏఓ శ్రీనాథ్

సిద్దిపేటఅర్బన్: వరికి సోకుతున్న అగ్గితెగులు రైతులలో గుబులు రేపుతోంది. సరైన సమయంలో నివారణ చర్యలు చేపట్టకపోతే పైరు మొత్తం తెగులు సోకి తీవ్రమైన నష్టం వాటిల్లే అవకాశం ఉంటుందని ఏఓ బి.శ్రీనాథ్ చెప్పారు. ఆయన ఏఈఓ రాజేశ్‌తో కలిసి మండలంలోని బక్రిచెప్యాల గ్రామంలో మంగళవారం అగ్గి తెగులు సోకిన వరి పైరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నివారణ చర్యలతో అగ్గి తెగులును అరికట్టవచ్చన్నారు. నివారణ చర్యల గురించి రైతులకు అవగాహన కల్పించారు. పది రోజులుగా రాత్రి సమయంలో ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండటం, ఆకులపై మంచు కమ్ముకోవడం, అలాగే అధికంగా నత్రజని వాడటం వల్ల పలు గ్రామాల్లో అగ్గి తెగులు లక్షణాలు కనిపిస్తున్నాయని చెప్పారు. ప్రారంభదశలోనే దీనిని నివారించకపోతే తీవ్రమైన నష్టం కలుగుతుందని రైతులను హెచ్చరించారు.

మొగి పురుగు నివారణకు చర్యలు

వరి చిరుపొట్ట దశలో ఉన్నప్పుడు వరి కాండానికి మొగి పురుగు ఆశిస్తుందని, దాని నివారణ కోసం కార్టప్ హైడ్రాక్లోరైడ్ 75ఎస్‌జీ మందును 250 గ్రాములు లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 60 మి.లీ లేదా టెట్రానిలిప్రోల్ 100 మి.లీ ద్రావణాన్ని 200 లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారీ చేసుకోవాలని సూచించారు.


రైతుకు సూచనలిస్తున్న ఏఓ శ్రీనాథ్, పక్కన ఏఈఓ

అగ్గి తెగులు లక్షణాలు..

వరి ఆకులపైన నూలు కండె ఆకారంలో బూడిద రంగు మచ్చలు చుట్టూ ఇటుక రంగుతో ఉండి క్రమేణా విస్తరిస్తూ ఆకు మొత్తం ఎండిపోతుంది.

నివారణ చర్యలు

అగ్గి తెగులు గమనించినట్లయితే నత్రజని సంబంధిత ఎరువుల వినియోగాన్ని వాయిదా వేసుకోవాలి. పొలంలో సరిపడా నీరు ఉంచుకోవాలి. అనుకూల వాతావరణ పరిస్థితులు ఉంటే వెంటనే రైతులు రసాయన మందులు పిచికారీ చేసుకోవాలి.


అగ్గి తెగులు సోకిన వరి

ట్రైసైక్లాజోల్ 120 గ్రా లేదా ట్రిఫ్లాక్సిస్ట్రోబిన్+టెబుకోనజోల్ 90 గ్రా లేదా కాక్సిస్ట్రోబిన్+ట్రైసైక్లాజోల్ 400 మి.లీ మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

ఏకాగ్రతతోనే లక్ష్యసాధన సాధ్యం

సీఐ శ్రీను


చేర్యాల(సిద్దిపేట): మాట్లాడుతున్న సీఐ శ్రీను

చేర్యాల(సిద్దిపేట): విద్యార్థులు ఏకాగ్రతతో చదివితేనే అనుకున్న లక్ష్యాన్ని సాధించగలరని సీఐ ఎల్.శ్రీను అన్నారు. మండల పరిధిలోని ముస్త్యాల మోడల్ స్కూల్‌లో మహిళలు, బాలికల రక్షణ కోసం ఉన్న చట్టాలపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలన్నారు. షీటీం ప్రాముఖ్యం, పోక్సో చట్టాలు, బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, ఈవ్ టీజింగ్, గుడ్ టచ్, బాడ్ టచ్, సోషల్ మీడియా వల్ల కలిగే పరిణామాలు, సైబర్ సెక్యూరిటీ, మైనర్ డ్రైవింగ్, డయల్ 100 ప్రాముఖ్యత, సమాజంలో జరుగుతున్న నేరాల నుంచి ఎలా రక్షణ పొందాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భిక్షం, ఉపాధ్యాయులు, హుస్నాబాద్ షీటీం బృందం సదయ్య, ప్రశాంతి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

గజ్వేల్‌రూరల్: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ మురళి హెచ్చరించారు. ఆయన మాట్లాడుతూ గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపలిటీ పరిధిలో ఇటీవల నిర్వహించిన వాహన తనిఖీల్లో 23 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుపడ్డారని, వారిని కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి రూ.16,600 జరిమానా విధించారన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలి

దుబ్బాకటౌన్: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలని, గొడవలకు దిగిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ గంగరాజు అన్నారు. చెర్వాపూర్, మల్లాయపల్లి వార్డులలో సీసీ కెమెరాల ప్రాముఖ్యత, సైబర్ క్రైమ్, మహిళ రక్షణ చట్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వివిధ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రానున్న రోజుల్లో మరిన్ని ఉద్యోగాలు

చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): రాబోయే రోజుల్లో మరిన్ని ఉద్యోగాలు భర్తీ చేసేందుకు రాష్ట ప్రభుత్వం చర్యలు చేపట్టిందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. మండలంలోని రాంపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీసీసీ ఉపాధ్యక్షుడు సాంబయ్యతో కలిసి మంగళవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో 55 వేల ఉద్యోగాలు భర్తీ చేశారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని ఆయన అధ్యాపకులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మాజీ ఉపాధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కొండల్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, స్వామి, భరత్, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.


తొగుట(దుబ్బాక): ప్రచారంలో పాల్గొన్న శ్రీనివాస్‌రెడ్డి

మొదటి ప్రాధాన్యత ఓటువేయండి

చిన్నకోడూరు(సిద్దిపేట): పట్టభద్రుల కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అంజిరెడ్డి ప్రజల కష్టాలు తెలిసిన వ్యక్తి అన్నారు. నాయకులు పరశురాములు, రాజు, రాజేశ్, భూపతిరెడ్డి, గణేశ్, జయంత్, ప్రశాంత్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల దృష్టికి తీసుకెళ్తాం

గజ్వేల్: కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను పట్టభద్రుల దృష్టికి తీసుకెళ్లి ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలుపునకు కృషి చేస్తామని టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు చెప్పారు. గజ్వేల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో యాదగిరి, గోపాల్‌రావు, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల బీజేపీ అభ్యర్థిని ఓడించాలి

కోహెడ(హుస్నాబాద్)/హుస్నాబాద్: పట్టభద్రుల బీజేపీ అభ్యర్థిని ఓడించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక సింగరాయ ఫంక్షన్ హాల్‌లో విలేకరులతో మాట్లాడారు. పార్టీ బలపరిచిన నరేందర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అలాగే హుస్నాబాద్‌లోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలన్నారు. ఆయా కార్యక్రమాలలో లక్ష్మారెడ్డి, వీరన్న యాదవ్, నరేశ్, సత్యనారాయణ, మల్లేశ్, అశోక్, స్వామి, శంకర్, గోపి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

జిల్లాలో పలు పాఠశాలల్లో స్వయం పాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటివారికి పాఠాలు బోధించారు. ఉత్తమ ప్రతిభ చూపిన వారికి ఆయా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.


నంగునూరులో ఉపాధ్యాయులతో విద్యార్థులు


వర్గల్(గజ్వేల్): చాంద్‌ఖాన్‌మక్తలో..


కొండపాక(గజ్వేల్): బందారం హైస్కూల్లో..



యువ ఉత్సవ్.. అదుర్స్

నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక విపంచి ఆడిటోరియంలో నిర్వహించిన యువ ఉత్సవ్ అందరినీ ఆకట్టుకుంది. అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వివిధ అంశాలపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. – సిద్దిపేటజోన్

పొద్దుతిరుగుడు సాగుతో లాభాలు


పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

తొగుట(దుబ్బాక): ఏరువాక కేంద్రం, తోర్నాల వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు మండలంలోని ఘనపురంలో పొద్దుతిరుగుడు పంటను సందర్శించారు. శాస్త్రవేత్తలు విజయ్, పల్లవి రైతు అక్కం స్వామి సాగుచేసిన ఎన్‌డీఎస్‌ఎచ్–1012 రకం పొద్దుతిరుగుడు సాగును మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో వరి తర్వాత యాసంగిలో మొక్కజొన్నకు బదులుగా పొద్దుతిరుగుడు సాగుచేసి అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉందన్నారు. వరి కొయ్యలు కాల్చకుండా పొలం దున్నకుండా జీరో టిల్లేజ్ పద్ధతిలో పొద్దుతిరుగుడు సాగు చేసినప్పుడు మొలక శాతంలో ఏమీ తేడాలుండవని రైతులకు సూచించారు. ఈ విధంగా సాగుచేస్తే తక్కువ ఖర్చవుతుందని, నీరు కూడా ఆదా అవుతుందని చెప్పారు. భూమిలోని సూక్ష్మ జీవులు చనిపోకుండా సజీవంగా ఉండటంతో మంచి దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ దేవేందర్, రైతులు పాల్గొన్నారు.

జరిమానా తప్పదు

సిద్దిపేటజోన్: నిబంధనలు ఉల్లంగిస్తే జరిమానా విధించాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ సూచించారు. మంగళవారం పారిశుద్ధ్య విభాగం అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. తడి, పొడి, హానికర చెత్తను వేరుచేసి ఇవ్వాలని, ప్రజల్లో చైతన్యం తేవాలని సూచించారు.

సిటిజన్ ఫీడ్ బ్యాక్‌లో పాల్గొనండి

మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్

హుస్నాబాద్: స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా సిటిజన్ ఫీడ్ బ్యాక్‌లో ప్రతి ఒక్కరు పాల్గొనాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ కోరారు. పట్టణంలో పారిశుద్ధ్య పనులను మంగళవారం ఆయన పర్యవేక్షించారు. పలు వార్డుల్లో తడి చెత్త, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. పొడి చెత్త సేకరణ, సేంద్రియ ఎరువు కేంద్రాలు, డంపింగ్ యార్డులను పర్యవేక్షించి సిబ్బందికి సూచనలిచ్చారు. అనంతరం మాట్లాడుతూ పట్టణ ప్రజలు తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహన సిబ్బందికి అందించాలన్నారు. సిటిజన్ ఫీడ్ బ్యాక్‌లో మెరుగైన ఫీడ్ బ్యాక్ ఇచ్చి హుస్నాబాద్‌ను స్వచ్ఛతలో ముందుంచాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, పర్యావరణ అధికారి రవికుమార్ తదితరులు ఉన్నారు.

కక్షతోనే సాగునీరివ్వడం లేదు..

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: కాంగ్రెస్ ప్రభుత్వం కక్షగట్టి సాగునీరు అందించడంలేదని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మండిపడ్డారు. మంగళవారం గజ్వేల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. పాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి కొండపాక మండలంలోని పంట పొలాలకు వెంటనే సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. కొండపాక, దమ్మక్కపల్లి, సిరిసినగండ్ల, మర్పడగ, ఖమ్మంపల్లి, తిమ్మారెడ్డిపల్లి, గిరాయిపల్లి, జప్తినాచారం, దుద్దెడ గ్రామాల్లోని రైతులకు సాగునీరు అందక అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జగదేవ్‌పూర్ మండలంలోని పలు గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని, ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన తప్పదని హెచ్చరించారు.

భయాలు తొలగుతాయి: డీఈఓ

కొండపాక(గజ్వేల్): దుర్గను తలిస్తే భయాలు తొలగుతాయి, కొలిస్తే శుభాలు కలుగుతాయని జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మర్పడ్గలోని మల్లికార్జున స్వామి క్షేత్రంలో విబుధ సంసర్గ మర్పడ్గ విజయదుర్గ అనే పుస్తకాన్ని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్‌తో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షేత్ర నిర్వాహకులు డాక్టర్ హరనాథ శర్మ కోరిక మేరకు త్వరలో ఒకరోజు శిక్షణ కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తామన్నారు. నరసింహారావు, సరస్వతి పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రిక అందజేత

మర్కూక్(గజ్వేల్): మండలంలోని అంగడికిష్టాపూర్‌లో కొలువైన ఉమామహేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఆలయ చైర్మన్ శ్రీనివాస్ గుప్త, మాజీ సర్పంచ్ లక్ష్మిరాములు మంగళవారం రామకోటి రామరాజుకు అందజేశారు. 5 రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాలలో పాల్గొనాలని కోరారు. వారి వెంట గ్రామస్తులు వెంకటేశం, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ హైనా దాడిలో దూడ మృతి

మద్దూరు(హుస్నాబాద్): హైనా దాడిలో ఓ దూడ మృతి చెందిన ఘటన మండలంలోని వంగపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఏసురెడ్డి రోజూ మాదిరిగానే సోమవారం రాత్రి గేదెతోపాటు దూడను తన వ్యవసాయ బావి వద్ద కట్టేసి ఇంటికి వచ్చాడు. తెల్లవారుజామున వెళ్లి చూడగా దూడ మృతి చెంది ఉండడం గమనించాడు. హైనా దాడివల్లే మృతి చెందిందని చెప్పాడు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

◆ పోలింగ్ స్టేషన్లలో సౌకర్యాలు

దుబ్బాక: ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ స్టేషన్లలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. మంగళవారం స్థాని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. సిబ్బంది, అధికారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు.

◆ ఉత్సాహంగా 'ఓపెన్ ల్యాబ్'

సిద్దిపేటఎడ్యుకేషన్: ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఓపెన్ ల్యాబ్ ప్రదర్శన నిర్వహించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు ఆయా ల్యాబ్‌లను ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, వైస్ ప్రిన్సిపాల్ అయోధ్యరెడ్డి, ఐక్యూసీ కోఆర్డినేటర్ మధుసూదన్, అధ్యాపకులు శ్రీధర్, పవన్‌కుమార్, రాణి, మహేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

◆ అభివృద్ధికి సహకరించండి

గజ్వేల్: పట్టణ ప్రజలు ఇంటి పన్నులతో పాటు నల్లా, ట్రేడ్ లైసెన్స్ పన్నులను చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ నర్సయ్య కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వందశాతం పన్నుల వసూలుకు కృషి చేయాలన్నారు.

◆ కాంగ్రెస్‌కు ఈ ఎన్నికలు రెఫరెండం

హుస్నాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరుకు ఎమ్మెల్సీ ఎన్నికలు రెఫరెండం లాంటివని బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ ప్రవీణ్‌రావు అన్నారు. నియోజకవర్గ ముఖ్య నాయకులు, పోలింగ్ బూత్ బాధ్యులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రులు, ఉపాధ్యాయులు సీఎం రేవంత్ రెడ్డికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. లక్ష్మారెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

◆ ఘనంగా జాతీయసైన్స్ దినోత్సవం

గజ్వేల్‌రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ డాక్టర్ భవాని మాట్లాడారు. జీవితంలో ప్రతి అంశం సైన్స్‌తో ముడిపడి ఉంటుందని చెప్పారు. అనంతరం 'తమ కు నచ్చిన శాస్త్రవేత్త–జీవిత చరిత్ర' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు అలివేలు, విజయభాస్కర్‌రెడ్డి, డాక్టర్ వెంకటేశ్, జ్యోతి, లావణ్య, శివ, శంకర్, పద్మ, అమలాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ సామాజిక తనిఖీ

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలో త్వరలో నిర్వహించే సామాజిక తనిఖీలో అందరూ పాల్గొనాలని ఎంపీడీఓ యాదగిరి ఆదేశించారు. మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. 29 గ్రామాల్లో నాలుగు కోట్లతో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు చెప్పారు.